

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504 (121.7080)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.66 (2.70)	12.38	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.65 (0.40)	139	50

చికెన్ ధరలు | లైవ్ : రూ.142 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

ఎన్నుకున్న ప్రజలకు సేవ చేయాలని, తమ పాలనా హయాంలో శాశ్వతంగా గుర్తుండేలా పనులు చేయాలని, తమ వద్దకు వస్తే ఏ పనైనా చిటికెలో చేసేయాలనే సంకల్పంతో ఎన్నికల్లో పోరాడి గెలిచిన ఆ నాయకులు ప్రస్తుతం పూర్తి నైరాశ్యంతో పదవీ విరమణ చేస్తున్నారు. మండల ప్రాదేశిక నియోజవర్గ సభ్యుడి (ఎంపీటీసీ)గా ఐదేళ్లలో చెప్పుకోదగ్గ పనులేవీ చేయలేకపోయామని, ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చలేకపోయామని, అంతేకాదు కనీసం గౌరవాన్ని కూడా పొందలేకపోయామనే ఆవేదన వారిలో ఉంది. బుధవారంతో ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం ముగియనుంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)



చేసిందేమీలేక.. చెప్పుకోలేక

- నైరాశ్యంతో పదవీ విరమణ చేస్తున్న ఎంపీటీసీ సభ్యులు
- ఐదేళ్లు ఉత్సవ విగ్రహాలుగానే మిగిలామని ఆవేదన
- నిధులు, విధుల్లేక నీరసించిన పరిషత్‌లు
- కనీస గౌరవం కూడా దక్కలేదని అంతర్మథనం
- ఈ ప్రభుత్వమైనా బలోపేతం చేయాలని సూచన
- సర్పంచ్‌లతో సమానంగా అధికారాలివ్వాలని అభిప్రాయాలు

పదవీ కాలంలో ఉత్సవ విగ్రహాలుగా మిగిలామే తప్ప సాధించిందేమీ లేదని, ఈ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం బాధ కలిగించిందని, ప్రస్తుత ప్రభుత్వమైనా బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఎంపీటీసీలు కోరుతున్నారు. 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం అధికారాలు, విధులు బదలాయించాలని వారు అభిప్రాయపడుతున్నారు.

ఐదేళ్లలో నిధుల్లేవు.. విధుల్లేవు

రాజ్యాంగ సవరణ 73 ప్రకారం ఏర్పాటైన ఐదంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు ఏర్పాటయ్యాయి. కనీసం మూడువేల జనాభాకు తగ్గకుండా ఈ స్థానాలను నిర్దేశించారు. ఒక్కో మండల ప్రజాపరిషత్ పరిధిలో కనిష్ఠంగా 4 నుంచి గరిష్ఠంగా 19 వరకు ఉమ్మడి జిల్లాలో ఈ నియోజకవర్గాలు ఉన్నాయి. 2014కు ముందు మండల పరిషత్‌లకు కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘాల నిధుల్లో 35శాతం వాటా ఉండేది. అదే విధంగా రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, బీఆర్‌జీఎఫ్ నిధులు వచ్చేవి. ఇవన్నీ కలిపి ఒక్కో ఎంపీటీసీ సభ్యుడి పరిధిలో ఏడాదికి కనీసంగా రూ.10లక్షలకు తగ్గకుండా నిధులొచ్చేవి. వాటితో లింకురోడ్లు, తాగునీటి పైప్‌లైన్ల మరమ్మతులు, అదనపు తరగతి గదుల వంటి నిర్మాణాలు చేపట్టేవారు. అయితే 2014తర్వాత కేంద్రం నుంచి వచ్చే పంచాయతీరాజ్ నిధులను 90శాతం గ్రామ పంచాయతీలకే కేటాయించడంతో ఆ మేరకు మండల, జిల్లా పరిషత్‌లకు నిధులకొరత ఏర్పడింది. దానికి తోడు రాష్ట్ర ప్రభుత్వం సైతం ఎంపీపీ, జడ్పీ చైర్మన్ ఎన్నిక సమయంలో తప్ప మిగిలిన సందర్భాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు కనీస ప్రాధాన్యం ఇవ్వలేదు. తమకు కనీస బాధ్యతలు, నిధులు, విధులు కేటాయించాలని వీరు పలు సందర్భాల్లో ఆందోళనలు, ధర్నాలు చేసినా పరిస్థితి మారలేదు. ఎంపీటీసీ స్థానం పరిధిలో ఐదేళ్లలో రూ.5లక్షల నుంచి రూ.7లక్షలకు మించి నిధులు రాలేదని, వీటితో ఆశించిన రీతిలో పనులు చేయలేకపోయామని పలువురు ఎంపీటీసీ సభ్యులు వాపోయారు. గ్రామపంచాయతీల్లో వార్డుమెంబర్‌కు ఉన్న గౌరవం, మర్యాద కూడా తమకు ఇవ్వలేదని, పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక ఛాంబర్ ఇవ్వలేదని, పంచాయతీలకు వచ్చే నిధులతో చేపట్టే పనుల్లో తాము సూచించినవి చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీటీసీ సభ్యుడిగా కనీసం బోరుమోటర్ కూడా మరమ్మతు చేయించలేని దుస్థితిని ఎదుర్కొన్నామని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో మండల పరిషత్‌ల వివరాలు		
జిల్లా	మండల పరిషత్‌లు	ఎంపీటీసీల సంఖ్య
నల్లగొండ	31	350
సూర్యాపేట	23	225
యాదాద్రి	17	177
మొత్తం	71	752

విధులు, బాధ్యతలు ఇవ్వాలి

పంచాయతీరాజ్‌లో ఐదంచెల వ్యవస్థను నెలకొల్పిన కాంగ్రెస్ హయాంలోనైనా జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు నిధులు, విధులు, గౌరవం పెంచాలని పదవీ విరమణ చెందుతున్న ఎంపీటీసీ సభ్యులు కోరుతున్నారు. ప్రధానంగా గ్రామపంచాయతీల్లో సర్పంచ్‌లకు సమానంగా ఎంపీటీసీ సభ్యులకు నిధులు, విధులు, బాధ్యతలు కేటాయించాలంటున్నారు. పంచాయతీలకు వచ్చే నిధులతో చేపట్టే పనులను గుర్తించడంలో ఎంపీటీసీ సభ్యుల సూచనలకు తప్పనిసరిగా ప్రాధాన్యమివ్వాలని, గ్రామపంచాయతీల్లో ప్రత్యేక ఛాంబర్ ఇవ్వాలని, ఎంపీటీసీ పరిధిలో ఒక ఉద్యోగిని కూడా కేటాయించాలని కోరుతున్నారు. మండల పరిషత్‌లకు వ్యవసాయం, మైనింగ్, ప్రాథమిక విద్యాశాఖ, డీఆర్‌డీఏ శాఖలను అప్పగిస్తే వాటిని ప్రజలకు చేరువచేసేందుకు ఎంపీటీసీ సభ్యులకు వెసలుబాటు లభిస్తుందని, ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉత్సవ విగ్రహాలుగానే మిగిలాం



ఎంపీటీసీ సభ్యుడిగా ఎంతో చేయాలనే సంకల్పంతో ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందా. గ్రామాల్లో ఉన్న ఎన్నో సమస్యలు పరిష్కరించాలనుకున్నాం. కానీ ఎంపీటీసీ వ్యవస్థ ఆరోవేలులా మారింది. మండలాలకు కనీస నిధుల్లేక ఏపనులూ చేయలేకపోయాం. ఐదేళ్లలో కేవలం రూ.7లక్షల నిధులే రావడం అంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రభుత్వమైనా ఎంపీటీసీ వ్యవస్థకు నిధులు, విధులు ఇస్తుందని ఆశిస్తున్నాం.

- పాలడుగు హరికృష్ణ, పిట్టంపల్లి ఎంపీటీసీ, కట్టంగూరు

ఎంపీటీసీ పరిధిలో 40శాతం నిధులు కేటాయించాలి



ఐదేళ్లలో ఆశించిన పనులేవీ చేయలేకపోయాం. ప్రత్యక్ష ఎన్నికల్లో గెలుపొందినా, ప్రజలకు ఇచ్చిన కనీస హామీలు అమలు చేయలేకపోయామనే ఆవేదన మిగిలింది. నిధుల విషయానికి వస్తే మేం ప్రతిపక్ష పార్టీ కావడంతో అప్పటి అధికార పార్టీ నాయకులు మాకు వచ్చిన కొద్ది నిధులు కూడా దక్కకుండా చేశారు. ఈ వివక్షపై పోరాడినా ఫలితం దక్కలేదు. ఎంపీటీసీలకు గ్రామపంచాయతీల్లో సర్పంచ్‌లకు సమానంగా అధికారాలు ఇవ్వాలి. నిధుల విషయంలో 40శాతం ఎంపీటీసీలకు కేటాయించాలి. ఈ వ్యవస్థను బలోపేతం చేయకపోతే ఉపయోగం ఉండదు.

- చల్లభట్ల చైతన్య, వేములపల్లి ఎంపీటీసీ

సర్పంచ్‌లతో సమానంగా అధికారాలివ్వాలి



ఎంపీటీసీ సభ్యులకు గత ఐదేళ్లలో కనీస ప్రాధాన్యం దక్కలేదు. అరకొర అధికారాలు, నిధుల కేటాయింపుతో అసంతృప్తి మిగిలింది. రానున్న రోజుల్లోనైనా సర్పంచ్‌ల మాదిరిగా పాలనాపరమైన నిర్ణయాల్లో ప్రాధాన్యం కల్పించాలి. పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక గదిని కేటాయించాలి. నిధులు కూడా ప్రత్యేకంగా కేటాయించాలి. నేరుగా కొన్ని మౌలికవసతులు కల్పించే పనులైనా ఎంపీటీసీ సభ్యుల ప్రతిపాదనల మేరకు చేసేలా నిధుల కేటాయింపులుండాలి.

- బచ్చనగోని గాలయ్య, సంస్థాన్‌నారాయణపురం ఎంపీటీసీ

జిల్లా అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం

మరువలేనిది

జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కలెక్టర్ హనుమంతు కే.జెండగే



జడ్పీ చైర్మన్ , కలెక్టర్‌ను సన్మానిస్తున్న సీఈవో శోభారాణి, వైస్ చైర్మన్ భీకునాయక్ తదితరులు

భువనగిరి రూరల్, జూలై 2: జిల్లా సమగ్ర అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యం మరువలేనిదని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు.జడ్పీటీసీ, ఎంపీపీల ఐదేళ్ల పదవీకాలం ముగింపు సందర్భంగా మంగళవారం జడ్పీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేసినట్లు తెలిపారు. ఏ ఆశయం కోసం రాజకీయాల్లోకి వచ్చానో.. కేంద్ర ప్రభుత్వ 15వ ఆర్థిక సంఘం అరకొర విధులతో ఆశయాలను నెరవేర్చలేకపోయామన్నారు. 2019లో తాము బాధ్యతలు చేపట్టగా రెండున్నరేళ్ల పదవీ కాలం కరోనా విపత్కర పరిస్థితులతోనే ముగిసిందన్నారు. అయినప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారుల విశేష కృషితో అభివృద్ధికి పాటుపడ్డామన్నారు.

రైట్ టూ రీకాల్ పునరుద్ధరించాలి

రైట్ టూ రీకాల్ వ్యవస్థను పునరుద్ధరించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ వల్లే స్థానిక సంస్థలు ఏర్పడి గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. గెలిపించిన ప్రజలే నాయకులను తిరిగి వాపస్ రప్పించే రైట్ టూ రీకాల్ వ్యవస్థ పునరుద్ధరించినట్లయితే ప్రజాప్రతినిధులు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేస్తారన్నారు. రెండు రోజుల్లో జడ్పీటీసీలు, ఎంపీపీల పదవి కాలం ముగుస్తున్నందున రైట్ టూ రీకాల్ వ్యవస్థకు మద్దతు తెలిపేందుకు తీర్మానం ప్రకటించాలన్నారు. జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి జోక్యం చేసుకుని చట్ట సభల్లో ఈ వ్యవస్థ పునరుద్ధరణ అవుతుందని, పార్లమెంట్, అసెంబ్లీ, మండలిలో తీర్మానం ప్రవేశపెట్టేలా చూడాలన్నారు. స్పందించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శాసన మండలిలో ఈ వ్యవస్థ పునరుద్ధరణకు ప్రై వేట్‌బిల్లు ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

కలెక్టర్ మాట్లాడుతూ 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామాలను బలోపేతం చేయడానికి మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడిందని, గత ఐదేళ్ల కాలంలో గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఎనలేని కృషి చేశారన్నారు. కరోనా సమయంలో ధైర్యంగా గ్రామాల్లో ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై సమీక్షించుకుంటూ పనిచేశారని కొనియాడారు. జడ్పీ సీఈవో ఎన్ శోభారాణి మాట్లాడుతూ నూతన జిల్లా పరిషత్ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు రూ. 1837.63లక్షల నిధులు మంజూరు కాగా మండల పరిషత్ వాటా నిధుల కింద రూ.1531.59లక్షలు మంజూరై పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఒక్కో జడ్పీటీసీకి రూ.32. 81లక్షలు వివిధ అభివృద్ధి పనులకు కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ డాక్టర్ కుడుదుల నగేశ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, స్థానిక జడ్పీటీసీ సుబ్బురు బీరుమల్లయ్య, ఎంపీపీలు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

'ధరణి' సమస్యలు త్వరగా పరిష్కరించాలి

అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి.బెన్ షాలోమ్

యాదగిరిగుట్ట రూరల్, జూలై 2: ధరణి సమస్యలు త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి.బెన్ షాలోమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీచేశారు. పలు రికార్డులను పరిశీలించి సమస్యలు పెండింగ్‌లో ఉండొద్దని, లోపాలు లేకుండా అన్నింటినీ సరిచేయాలన్నారు. వివరాలను తహసీల్దార్ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌కు బీజేవైఎం నాయకులు వినతిపత్రం అందజేశారు.

ఆర్సీవోను సస్పెండ్ చేయాలి

గురుకుల పాఠశాల ఎదుట బైఠాయించి విద్యార్థి సంఘాల డిమాండ్



గురుకుల పాఠశాల కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మోత్కూరు, జూలై 2: గురుకుల పాఠశాలల సమస్యలు పరిష్కరించలేని ఆర్సీవోను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మోత్కూరు ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. మోత్కూరు ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో ఉడకని అన్నం, నీళ్ల చారుతో విద్యార్థులకు భోజనం పెడుతున్నారని మంగళవారం పత్రికల్లో వచ్చిన వార్తలకు ఆర్సీవో రజని స్పందించారు. పాఠశాలలో ఆర్సీవో విచారణ జరుపుతుండగా, విద్యార్థి సంఘాల నాయకులు అక్కడకు చేరుకుని పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వని వారిపై ఏం చర్యలు తీసుకుంటున్నారని, కేర్‌టేకర్ ఎందుకు లేరని, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తో ఎంత కాలం పాఠశాలను నడిపిస్తారని ఆర్సీవోను నిలదీశారు. ఆమె నుంచి సరైన సమాధానాలు రావడం లేదంటూ విద్యార్థి సంఘాల నేతలు ఆగ్రహించారు. పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ పాఠశాలకు మంగళవారం ఉదయం పాలు రాలేదని, ఆర్సీవో విచారణ జరుపుతుండగా పాఠశాల వెనుక గోడ పైనుంచి పాలు అందించారన్నారు. ఆర్సీవో వచ్చిన రోజే ఇలా ఉంటే మిగతా రోజుల్లో ఇంకెంత అధ్వానంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఆర్సీవో కనుసన్నల్లోనే పాఠశాలలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు మోత్కూరు వచ్చారని తెలిసి విద్యార్థి సంఘాల నాయకులు ఆర్సీవోపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమాల్లో ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్ర అనిల్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల శాంతికుమార్, యూత్‌కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మందుల సురేష్, అవిశెట్టి కిరణ్‌కుమార్, తీన్మార్ మల్లన్నటీం మండలాల అధ్యక్షులు ముక్కెర్ల బిక్షపతి, మందుల శ్రీకాంత్, సింగారం రమేష్, చేడె ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరోపణల్లో నిజం లేదు : ఆర్సీవో

గురుకుల పాఠశాలలో విచారణ జరిపిన అనంతరం ఆర్సీవో రజని విలేకరులతో మాట్లాడారు. తన కనుసన్నల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయన్న విద్యార్థి సంఘాల ఆరోపణల్లో నిజం లేదన్నారు. ప్రిన్సిపాల్ డిప్యుటేషన్‌పై వెళ్లడంతో వైస్‌ప్రిన్సిపాల్‌ను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియమించామన్నారు. ఈ నెలలో రెగ్యులర్ ప్రిన్సిపాల్ వస్తారన్నారు. సోమవారం వంట మనుషులు పప్పు మెత్తగా రుబ్బకుండా చారు చేయడంతో అది నీళ్లలా ఉందని, గంజి వార్చకుండా వండటంతో అన్నం సరిగా ఉడకలేదని, వంట మనుషులను మందలించానన్నారు. మంగళవారం పాఠశాలకు రావాల్సిన విజయ పాలకు బదులు వేరే పాలు వచ్చాయని, అలా ఎందుకు జరిగిందో విచారిస్తానన్నారు. అడ్డగూడూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రూప, మోత్కూరు ప్రిన్సిపాల్ వెంకటస్వామి ఆమె వెంట ఉన్నారు.

అమ్మ జన్మనిస్తే.. వైద్యులు పునర్జన్మనిస్తారు

కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి టౌన్, జూలై 2: అమ్మ జన్మనిస్తే.. వైద్యులు పునర్జన్మనిస్తారని కలెక్టర్ హనుమంతు కే.జెండగె అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సోమవారంరాత్రి భువనగిరిలో నిర్వహించిన డాక్టర్స్ డేలో ఆయన మాట్లాడారు. వైద్యులను మాత్రమే ప్రజలు సంపూర్ణంగా విశ్వసిస్తారని అన్నారు. వైద్యంకోసం వచ్చే రోగులపట్ల వైద్యులు ఆత్మీయంగా వ్యవహరించాలి కానీ, లాభసాటి ధోరణిని ప్రదర్శించరాదన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య వ్యవస్థలపైనే ప్రజారోగ్యం ఆధారపడి ఉందన్నారు. కుటుంబం, వ్యక్తిగత సమయాన్ని కూడా రోగులకు వెచ్చిస్తున్న వైద్యులు అభినందనీయులన్నారు. అయితే కొంత మంది వైద్యుల ప్రవర్తన తీరు వైద్య వ్యవస్థకు మచ్చగా మారుతుండటం బాధాకరమన్నారు. అనంతరం వైద్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో యశోద, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు విజయ్ భార్గవ్, కార్యదర్శి డాక్టర్ కృష్ణ చైతన్య, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ జీ.లక్ష్మీనర్సింహారెడ్డి, వైస్‌చైర్మన్ దిడ్డి బాలాజీ, డివిజన్ కమిటీ చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి, సీడబ్ల్యూసీ చైర్మన్ జయశ్రీ పాల్గొన్నారు.

పదెకరాలకే 'రైతు భరోసా'

- సింగిల్ విండో సర్వసభ్య సమావేశం తీర్మానం
- రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే సామేలు



మోత్కూరులో జరిగిన సింగిల్ విండో సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేలు



తీర్మానానికి మద్దతు తెలుపుతున్న సభ్యులు

మోత్కూరు, జూలై 2: బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినట్లు భూస్వాములకు, రాళ్ల, గుట్టలకు రైతు భరోసా ఇవ్వొద్దని, పదెకరాల వరకే రైతులకు రైతు భరోసా ఇవ్వాలని మంగళవారం మోత్కూరు రైతు సేవా సహకార సంఘం (సింగిల్ విండో) సర్వసభ్య సమావేశం తీర్మానించింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సామేల్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం భూస్వాములకు, రాళ్ల, గుట్టలకు రైతుబంధు ఇచ్చి ప్రజాధనాన్ని అనర్హులకు అప్పనంగా దోచిపెట్టిందన్నారు. తమ ప్రభుత్వం రైతుల అభిప్రాయంమేరకే రైతు భరోసా ఇవ్వాలన్న సదుద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్నారన్నారు. రైతాంగ సమస్యలపై సీఎం క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నారన్నారు. వానాకాలంలో రోహిణి కార్తెలోనే రైతు భరోసా ఇస్తే బాగుంటుందన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పదెకరాలకు రైతు భరోసా ఇవ్వడంతోపాటు ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్నారు. అనాజిపురం రైతు గోరుపల్లి సంతోష్‌రెడ్డి రైతు భరోసా పదెకరాలకు ఇవ్వడంతోపాటు పంటలకు రూ.500నుంచి రూ.వెయ్యి బోనస్ ఇచ్చి రైతులను ప్రోత్సహించాలన్నారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ పదెకరాల వరకు రైతులకు, కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వాలన్నారు. 15ఎకరాల వరకు రైతు భరోసా' ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రైతు యానాల దామోదర్‌రెడ్డి కోరారు. ఐదెకరాల వరకే రైతు భరోసా ఇవ్వాలని, అదీ ఆదాయ పన్ను చెల్లించే వారికి, ఉద్యోగులకు ఇవ్వకూడదని కాంగ్రెస్ నాయకుడు అవిశెట్టి అవిలిమల్లు అన్నారు. కుటుంబానికి పదెకరాల వరకు రైతులకు, కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు, రైతు పోచం సోమయ్య కోరారు. ఆదాయ పన్ను చెల్లించేవారికి, ఉద్యోగులకు ఇవ్వకూడదన్నారు. సాగు చేసే భూమి మొత్తానికి రైతుబంధు ఇవ్వాలని పొడిచేడు రైతు కప్పె వెంకన్న కోరారు. సమావేశంలో డీసీవో పి.నాగమణి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ శైలజారెడ్డి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి, పైళ్ల యాదిరెడ్డి, బొల్లు యాదగిరి, లోక్‌సత్తా జిల్లా కార్యదర్శి తీపిరెడ్డి సోమిరెడ్డి, రాంపాక నాగయ్య, సంఘం సీఈవో కె.వరలక్ష్మీ, సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా, దాచారంలో సర్వే నెం.273లో పంచిన భూములకు పట్టాలు లేవని, వారి పరిస్థితి ఏమిటని ఆ గ్రామానికి చెందిన రైతు ఆకవరం చంద్రశేఖరాచారి ప్రశ్నించారు.

నిరుద్యోగులకు జాబ్‌క్యాలెండర్,

నిరుద్యోగ భృతి ఎక్కడ?

- ఉమ్మడి రాష్ట్ర పరిస్థితులు పునరావృతం
- ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి



భువనగిరిలోని బీఆర్ఎస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గొంగిడి సునీత

యాదాద్రి, జూలై 2(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు జాబ్‌క్యాలెండర్, నిరుద్యోగ భృతి ఎక్కడని, తెలంగాణలో ఉమ్మడి రాష్ట్ర పరిస్థితులు పునరావృతం అవుతున్నాయని ప్రభుత్వ మాజీ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఆరోపించారు. మంగళవారం భువనగిరిలోని బీఆర్ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బంగారు తెలంగాణగా తీర్చిదిద్దితే... కాంగ్రెస్ ప్రభుత్వం ఏడునెలల్లో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. ఎన్నికల్లో నిరుద్యోగులను ఉసిగొల్పి వారి ఓట్లు దండుకున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు జాబ్‌క్యాలెండర్, నిరుద్యోగ భృతి ఎక్కడని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఇచ్చిన రజనీ, భానుప్రియ అపాయింట్‌మెంట్ లెటర్లకు దిక్కులేదని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కలెక్టర్ స్థాయిలో భర్తీ చేస్తారని, సీఎం స్థాయిలో అవుట్‌సోర్సింగ్ అపాయింట్‌మెంట్‌లను ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. కలెక్టర్ చేయాల్సిన పని ముఖ్యమంత్రి చేస్తున్నారే తప్ప, ప్రజల కోసం చేసిందేమీ లేదన్నారు. నిరుద్యోగ యువతను ఉసిగొల్పిన కోదండరాం, తీన్మార్ మల్లన్న జాబ్‌క్యాలెండర్‌పై, నోటిఫికేషన్ల భర్తీపై ఎందుకు నోరు మెదపడంలేదన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, పోలీసులు లంచాలు తీసుకుంటూ పట్టుబడుతున్నారని ఆరోపించారు. పోలీసులు సివిల్ విషయాల్లో తలదూరుస్తూ ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అశాంతి, మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కర్రె వెంకటయ్య, సుధీర్‌రెడ్డి, ఎండీ ఖలీల్, శ్రీనివాస్, గోపాల్‌గౌడ్, అరుణ్, భరత్ పాల్గొన్నారు.

పత్తి సాగుకు ఊరటనిచ్చిన వర్షం

● ఊపిరి పీల్చుకున్న రైతులు


చౌటుప్పల్‌లో వర్షానికి తాజాగా కనబడుతున్న పత్తి మొలకలు

చౌటుప్పల్ టౌన్, జూలై 2: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ ప్రాంతంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి పత్తి సాగుకు కొంత ఊరట కలిగింది. రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రాంతంలో కొద్దిరోజులుగా వర్షాభావ పరిస్థితు నెలకొనడంతో పత్తి సాగుకు ఇబ్బందికరమైన వాతావరణం నెలకొంది. మే నెల చివర, జూన్ నెల మొదటివారంలో కురిసిన వర్షాలకు రైతులు పత్తి గింజలను విత్తారు. అప్పటి నుంచి వర్షాలు కురియకపోవడంతో దుక్కుల్లోని విత్తనాలు మాడిపోయాయి. ఎండల వేడిమికి కొన్ని ప్రాంతాల్లో పత్తి మొలకలు ఎండిపోయాయి. దీంతో విత్తనాలు మాడిపోవడంతో పాటు మొలకలు ఎండిపోయిన ప్రాంతాల్లో మళ్లీ పత్తి విత్తనాలను విత్తాల్సిన పరిస్థితి రైతులకు ఏర్పడింది. కొంతమంది రైతులు రెండు, మూడుసార్లు కూడా పత్తి విత్తనాలను దుక్కులలో విత్తారు. పత్తి విత్తనాల రెండు, మూడుసార్లు విత్తాల్సి రావడంతో రైతులకు అదనపు భారంగా మారింది. పత్తి విత్తనాల కోసం రైతులు వేల రూపాయలను ఖర్చు చేయాల్సి వస్తోంది. వర్షాభావ పరిస్థితులతో రైతులకు విపత్కర పరిస్థితి ఏర్పడింది. వారం రోజుల క్రితం పెద్దకొండూరు, ఎస్.లింగోటం గ్రామాల్లో కురిసిన వర్షాలకు ఆయా ప్రాంతాలలోని పత్తి సాగుకు కొంత ఊరట లభించింది. ఆరెగూడెం, కాట్రేవు, పంతంగి, చౌటుప్పల్, తంగడపల్లి తదితర గ్రామాల్లో వర్షపాతం తక్కువగా ఉండగా ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో రైతులకు కొంత ఊరట లభించింది. పత్తి మొలకలు ఎండిపోకుండా ఈ వర్షం కాపాడిందని రైతులు తెలుపుతున్నారు. మండలవ్యాప్తంగా 11,500 ఎకరాలలో పత్తి విత్తనాలను విత్తినట్టు ఏవో నాగరాజు తెలిపారు. కొద్ది పాటిగా కురిసిన వర్షంతో పత్తి సాగుకు ఎంతో మేలు జరిగింది.

మూడు సార్లు పత్తి విత్తనాలను విత్తా

సమయానికి వర్షాలు కురియకపోవడంతో దుక్కుల్లోని పత్తి విత్తనాలు మాడిపోయాయి. మొలకలు ఎండిపోయాయి. దీంతో రెండు, మూడుసార్లు పత్తి విత్తనాలను విత్తాల్సి వచ్చింది. 20 ఎకరాల్లో పత్తి సాగు చేశా. పత్తి విత్తనాలకు రూ.1.50 లక్షలు ఖర్చు చేశా. ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో పత్తి మొలకలకు కొద్దిపాటి తేమ మాత్రమే అందింది. ముస్ముందు పెద్ద వర్షాలు కురిస్తేనే పత్తి సాగుకు ప్రయోజనం కలుగుతుంది. లేకుంటే నష్టాల బారిన పడాల్సి వస్తుంది.

- జాల అయిలయ్య యాదవ్, రైతు,ఆరె గూడెం, చౌటుప్పల్ మండలం

బాల్యంపై బ్యాగుల మోత

● మోయలేక విద్యార్థులకు ఇబ్బందులు ● శారీరక ఎదుగుదలపై తీవ్రప్రభావం ● అమలుకు నోచుకోని నిబంధనలు



సూర్యాపేట(కలెక్టరేట్), జూలై 2: ఆడు తూ పాడుతూ సాగాల్సిన చదువులు విద్యార్థుల పాలిట భారంగా మారాయి.ఒక్కో విద్యార్థి ఒకటి రెండు బ్యాగులను రోజూ మోయాల్సి వస్తోంది. ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, నోట్‌బుక్స్‌లు ఎక్కువగా విని యోగిస్తున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వివిధరకాల పాఠ్య, నోట్ పుస్తకాలను ఉపయోగిస్తున్నారు. దీంతో విద్యార్థులు ప్రతి రోజూ వాటిని మోసుకుంటూ పాఠశాలలకు వెళ్లి రావడంతో ఆరోగ్య ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిమితికి మించిన బరువులను మోయలేక వంగిపోతున్నారు. అధిక బరువుతో విద్యార్థుల శారీరక ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. విద్యార్థుల బ్యాగుల భారాన్ని తగ్గించేందుకు చిల్డ్రన్స్ స్కూల్ బ్యాగ్స్ యాక్ట్ -2006 ఉన్నప్పటికీ అమలుకు నోచుకోవడంలేదు. చేసేది లేక విద్యార్థులు అధిక బరువుతో విద్యనభ్యసిస్తున్నారు. అంతేకాక జిల్లాలోని పలు ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన భవనాలు మూడు, నాలుగు అంతస్తులలో ఉంటున్నాయి. అధిక బరువుతో కూడిన బ్యాగులను భుజాన వేసుకొని అన్ని అంతస్తులను ఎక్కాల్సి వస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు కేవలం 6 కిలోల బ్యాగ్ మాత్రమే ఉండాలి. 12 కిలోల బ్యాగ్‌తో ఉన్న పుస్తకాలను ప్రస్తుతం విద్యార్థులు మోస్తున్నారు. సాధారణ ఒక విద్యార్థి ఎంత బరువు ఉంటే అందులో 10వ శాతం బరువు ఉన్న బ్యాగ్‌లను మాత్రమే మోయాలి. కానీ 10శాతం కన్న ఎక్కువగా కూడా మోస్తున్నారు. దీంతో భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. వెన్నపూస దెబ్బతినే ప్రమాదముంది. మోకాళ్ల నొప్పులును కూడా పెద్దయిన తర్వాత ఎదుర్కొవాల్సి వస్తుందంటున్నారు. గూని కూడా వచ్చే అవకాశమున్నట్లు డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మొత్తం 4,129 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 4,60,823 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 690, ప్రాథమికోన్నత పాఠశాలలు 78, ఉన్నత పాఠశాలలు 182 ఉన్నాయి. ఆయాపాఠశాలల్లో 58,999 మంది విద్యార్థులు చదువుతున్నారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలలు 248 ఉండగా 65వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 1,593 ఉండగా ఆయా పాఠశాలల్లో 1,22,262 మంది, ప్రైవేట్ పాఠశాలలు 453 ఉండగా 1,10,752 మంది చదువుతున్నారు. అదేవిధంగా యాదాద్రి-భువనగిరి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 712 ఉండగా 59,996 మంది, ప్రైవేట్ పాఠశాలలు 173 ఉండగా 43,814 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఎక్కువగా ప్రైవేట్ పాఠశాలల్లోనే విద్యార్థులకు పుస్తకాల బరువు ఎక్కువగా ఉంటుంది.

అమలుకు నోచుకోని చట్టం

విద్యార్థుల అధిక బ్యాగుల బరువును నియంత్రించేందుకు చిల్డ్రన్స్ స్కూల్ బ్యాగు యాక్ట్ -2006ను ప్రవేశపెట్టారు. ఈ చట్టం ఎక్కడ అమలుకు నోచుకోవడంలేదు. నర్సరీ విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు కలిపి కనీసం 10వరకు ఉంటున్నాయి. ఇదే తరహాలో విద్యార్థుల తరగతులను అనుసరించి పుస్తకాల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రభుత్వ నిబంధనలు కూడా ఎక్కడా కూడా అమలుకు నోచుకోవడంలేదు. 1వ తరగతి విద్యార్థులకు 6 కిలోలు, 2వ తరగతి విద్యార్థులకు 7కిలోలు, 3వ తరగతికి తొమ్మిది కిలోల బరువు ఈ విధంగా 10వ తరగతి విద్యార్థులకు సుమారు 25 కిలోల బరువుతో కూడిన పుస్తకాలు ఉంటున్నాయి.

అధిక బరువుతో ఆరోగ్యానికి ముప్పు....

విద్యార్థులు ప్రతి రోజూ మోసే బ్యాగుల అధిక బరువుతో వారి ఆరోగ్యానికి ముప్పు వాటిల్లనుంది. అధిక బరువు శారీరక ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. ఎముకలు, కండరాలు, మెడ, భుజాలు, వెన్నుపూసపై తీవ్ర ప్రభావం కనపడుతుంది. అంతేకాక విద్యార్థులు వంగిపోవడం జరుగుతుంది. దీని వలన శ్వాస కూడా సరిగా తీసుకోలేని పరిస్థితి నెలకొంటుంది.

భవిష్యత్‌లో వెన్నుపూసపై ప్రభావం



విద్యార్థులకు అధిక బరువుతో కూడిన బ్యాగులు ప్రమాదకరం. వారి వెన్నుపూసపై భవిష్యత్‌లో ప్రభావం పడుతుంది. విద్యార్థుల వయస్సుకు తగ్గట్టుగా బరువుఉండాలి. బ్యాగ్‌ల బరువు ఎక్కువగా ఉండడంతో పెరుగుదల ఆశించిన స్థాయిలో ఉండదు. అధికబరువుతో కూడిన బ్యాగులను వివిధ అంతస్తుల వరకు మోయడంతో మోకాళ్ల నొప్పులు భవిష్యత్‌లో వచ్చే అవకాశం ఉంటుంది.

● డాక్టర్ లకావత్ రమేష్‌నాయక్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూర్యాపేట.

ఎన్‌ఎస్‌జీలో ఆడనున్న బాలికల ఖోఖో జట్టు


క్లస్టర్-1లో ఖోఖో బాలికల విభాగంలో విజేతలుగా నిలిచిన నల్లగొండ కేంద్రీయ విద్యాలయ విద్యార్థినులు

నల్లగొండ, జూలై 2 : నల్లగొండ జిల్లా కేంద్రంలోని పీఎం కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు అండర్-17 బాలికల విభాగంలో నేషనల్ స్కూల్ గేమ్స్(ఎన్‌ఎస్‌జీ)కి ఎంపికయ్యారు. మంగళవారం విద్యాలయ ప్రిన్సిపాల్ జీ శ్రీనివాసులు, ఖోఖో కోచ్ మధుబాబు వివరాలు వెల్లడించారు. నల్లగొండ కేంద్రీయ బాలికల ఖోఖో జట్టు విద్యార్థినులు హైదరాబాద్ క్లస్టర్-1లో కంచన్‌బాగ్, భువనగిరి ఎన్‌ఎఫ్‌సీ నలగర్, సీఆర్‌పీఎఫ్ బార్కాస్, మహబూబ్‌నగర్ జట్లపై గెలుపొందినట్లు తెలిపారు. అదేవిధంగా సెమీస్‌లో ఉప్పల్, ఫైనల్స్‌లో ఖమ్మం జట్లపై గెలుపొంది క్లస్టర్-1లో విజేతలుగా నిలిచారన్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించే ఎన్‌ఎస్‌జీ రీజనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో బాలికల జట్టు పాల్గొంటుందన్నారు. క్లస్టర్ స్థాయిలో విజయం సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్, కోచ్‌లు అభినందించారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన జడ్పీచైర్మన్ నరేందర్‌రెడ్డి


మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన బండా నరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

నల్లగొండ, జూలై 2 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంగళవారం మెదక్ జిల్లా గజ్వేల్ సమీపంలోని ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో నల్లగొండ జిల్లా పరిషత్ ఛైర్మన్ బండా నరేందర్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 4వ తేదీతో జడ్పీ పాలకవర్గాల గడువు ముగుస్తున్న నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ పలు ప్రజాప్రతినిధులను సన్మానించారు. అదేవిధంగా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డిలు ఉన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను పలువురు నేతలు కలిశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డితో పాటు పలువురు నేతలు ఉన్నారు.

రాహుల్‌గాంధీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేస్తున్న బీజేవైఎం నాయకులు

రామగిరి, జూలై 2 : కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ హిందువుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడారని బీజేవైఎం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ అధ్వర్యంలో మంగళవారం నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ పార్లమెంట్ సాక్షిగా హిందువు అని చెప్పుకునేవారు హింసను ప్రోత్సహిస్తారని, అసత్యాన్ని మాట్లాడుతారని హిందువులపై అనుచిత వ్యాఖ్యాలు చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మాటలు హిందూ సమాజాన్ని, హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ విధానం హిందువులకు వ్యతిరేకమని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు ఉన్నారు.

కొత్త చట్టాల ప్రకారం భువనగిరిలో మూడు కేసులు

భువనగిరి టౌన్, జూలై 2 : తాజాగా నుంచి అమల్లోకి వచ్చిన కొత్తచట్టాల ప్రకారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మూడు కేసులు నమోదయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం భువనగిరిలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గం చివరి సమావేశానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరయ్యారు. ఈ మేరకు నిరుద్యోగం తదితర సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీజేపీ కార్యకర్తలు జడ్పీ కార్యాలయంలోకి దూసుకెళ్లి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. ఈ మేరకు వచ్చిన ఫిర్యాదు మేరకు నూతన చట్టం 171 ప్రకారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం, బీజేవైఎం అధ్యక్షుడు కానుకుంట్ల రమేష్, రావుల సంతోష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన సుధీర్‌కుమార్ ఇంటి ముందు నిలిపి ఉన్న బైక్ చోరీకి గురైంది. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు నూతన చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె వీరస్వామి తెలిపారు. పట్టణ శివారులోని ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ వద్ద నిషేధిత గుట్కాలు విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు సంబంధిత దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ మేరకు రూ.8వేల విలువైన గుట్కా ప్యాకెట్లు లభించాయి. దీంతో గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని విక్రయదారుడు కొత్త శేఖర్‌పై నూతన చట్టం 270 బీఎన్ఎస్, 275 బీఎన్ఎస్, 20-2 కోకో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. జూలై 1 నూతన చట్టాలు అమల్లోకి రాగా రెండో రోజైన మంగళవారం మూడు కేసులు నమోదయ్యాయి.

డీసీఎం, లారీ ఢీకొని ఐదు గేదెలు మృతి

మద్దిరాల, జూలై 2 : సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరెంట్లలో డీసీఎం లారీ ఢీకొని ఐదు గేదెలు మృతి చెందాయి. ఎస్‌ఐ మధునాయుడు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా మరిపెడబంగ్లా నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా డీసీఎంలో 22 గేదెలను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. మార్గమధ్యలో మద్దిరాల మండలం గోరెంట్ల గ్రామశివారులో సూర్యాపేట నుంచి దంతాలపల్లికి వెళ్తున్న లారీ వెనక నుంచి డీసీఎంను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎంలో ఐదు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. 17 గేదెలను యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం చల్లూరులోని గేదెల సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. మృతి చెందిన గేదెలకు పశువైద్యాధికారి ఆసీఫా పరీక్షలను నిర్వహించి ఖననం చేయించారు. అక్రమంగా గేదెలను తరలిస్తున్న వారిపై, లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధునాయుడు తెలిపారు.

నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

తిప్పర్తి, జూలై 2 : అక్రమంగా తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీసులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదుచేశారు. ఎస్‌ఐ డీ రాజు తెలిపిన వివరాల ప్రకారం కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన జాతంగి సైదులు తిప్పర్తి మండలంలోటని పలు గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి,మార్కెట్‌లో విక్రయిస్తున్నాడు. మంగళవారం మామిడాల గ్రామం నుంచి నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆటోలో నకిరేకల్ రోడ్డు వైపు తీసుకెళ్తుండగా పెట్రోలింగ్‌లో అటుగా వెళ్లిన పోలీసులు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. సైదులుపై కేసు నమోదు చేసి బియ్యాన్ని సివిల్ సప్లయి విభాగానికి అప్పగించనున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్యాయత్నం

చివ్వెంల, జూలై 2 : యువకుడి వేధింపులు భరించలేక ఓ యువతి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటనలో యువకుడి సహా కుటుంబసభ్యులపై కేసు నమోదైంది. ఇదే కేసులో యువకుడి సోదరుడు, పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న వ్యక్తిపైనా కేసు నమోదైంది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా హుజుర్‌నగర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి ఐదేళ్ల కిందట తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతిచెందడంతో చివ్వెంల మండలంలోని గుంజలూరు గ్రామంలో మేనమామ వద్ద ఐదేళ్లుగా ఉంటోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కొనకంచి మహేష్ యువతిని లోబర్చుకుని లైంగిక వేధింపులకు పాల్పడడంతో పాటు బెదిరించసాగాడు. దీంతో మనస్తాపానికి గురైన యువతి సోమవారం తెల్లవారుజామున క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన మేనమామ సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆయన ఫిర్యాదు మేరకు నిందితుడు మహేష్‌తో పాటు అతడి సోదరుడు తుల్జారావుపేట జూనియర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కొనకంచి అశోక్, ఆయన తల్లి, మరో సోదరుడు అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బీ వెంకటరెడ్డి తెలిపారు. ప్రస్తుతం యువతి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిపారు.

రాజీకోసం రంగంలోకి నాయకులు

సోమవారం ఉదయం పోలీసులకు యువతి మేనమామ ఫిర్యాదు అందిస్తే, రాత్రి సమయంలో కేసు నమోదుచేశారు. కేసు నుంచి పంచాయతీ కార్యదర్శిని తొలగించాలని పోలీసులు యువతి బంధువులపై ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ససేమిరా అనడంతో చేసేదేమీలేక పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఇదే కేసును పూర్తిగా రాజీకి తీసుకువచ్చేందుకు అదే గ్రామానికి చెందిన పలువురు, పలు పార్టీల కొందరు నాయకులు పోలీసుల సహకారంతో మంగళవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ప్రయత్నించారు.

ప్రయాణికుడి వద్ద నగదు చోరీ

చివ్వెంల, జూలై 2 : బస్సులో ప్రయాణికుడికి సంబంధించిన రూ.12 లక్షల నగదు చోరీకి గురైంది. మంగళవారం సూర్యాపేట జిల్లా చివ్వెంల ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు చెందిన కొల్లి శివకుమార్ రూ.12 లక్షలను హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన ఫణి అనే వ్యక్తి వద్ద నుంచి జూన్ నెల 30న తీసుకున్నాడు. అదే రోజు రాత్రి ఓ ట్రావెల్ బస్సు ఎక్కి హైదరాబాద్ నుంచి విజయవాడకు బయలుదేరాడు. హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారి పక్కన చివ్వెంల మండలం వల్లభాపురం వద్ద గల సాయి క్రిష్ణ హోటల్ వద్ద బస్సును సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో కాలకృత్యాల కోసం నిలిపారు. శివకుమార్ మూత్రవిసర్జనకు వెళ్లి వచ్చి బస్సు ఎక్కి బ్యాగును చూడగా అందులోని నగదు కనిపించలేదు. దీంతో చేసేదేమిలేక స్థానిక చివ్వెంల పోలీసులకు శివకుమార్ ఫిర్యాదుచేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు. బస్సులో ప్రయాణించిన వారిలో అనుమానస్పద వ్యక్తుల వివరాలు సేకరించి, పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

మట్టి టిప్పర్లను అడ్డుకున్న స్థానికులు

చింతపల్లి, జూలై 2 : నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం ఘడియగౌరారంలో ఒండ్రుమట్టిని తరలిస్తుండగా మంగళవారం స్థానికులు అడ్డుకున్నారు. టిప్పర్ల ద్వారా ఉప్పరపల్లి, తిరుమలాపురం మీదుగా మట్టిని తరలిస్తుండగా పక్కా సమాచారంతో నసర్లపల్లి గేట్ సమీపంలో అడ్డుకున్నారు. అధికలోడ్‌తో టిప్పర్లు ప్రయాణించడంతో బీటీ రహదారులు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా తయారవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు చొరవ తీసుకుని ఒండ్రుమట్టి అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

గుట్టలో గంజాయి పట్టివేత

యాదగిరిగుట్ట రూరల్, జూలై 2: యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం పట్టణంలో సాధారణ వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో తనిఖీల్లో భాగంగా ఆటోలో ప్రయాణిస్తున్న వడ్లకొండ నరేష్, కే సిద్ధులు వద్ద 35 గ్రాముల గంజాయి లభ్యమైందని, వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా

- కంపసాగర్‌లో 32 ఎకరాల ఆక్రమణ
- కబ్జా భూమి విలువ సుమారు రూ.10 కోట్లు
- పట్టించుకోని యంత్రాంగం



కంపసాగర్‌లో కబ్జాకు గురైన బండకుంట, ప్రభుత్వ భూమి



త్రిపురారం, జూలై 2 : ఒకటి ఊరకుంట, మరొకటి పశువులు మేసే ప్రభుత్వ భూమి ఊరందరికీ ఉపకారిగా ఉండే ఈ స్థలాలపై కొందరు కన్నేశారు. సర్కారు భూమే కదా ఎవరూ పట్టించుకుంటారులే అనుకున్నారు. దర్జాగా కబ్జా చేశారు. ఈ భూమి విలువ సుమారు రూ.10 కోట్ల వరకు ఉంటుంది. అయినా ఇప్పటివరకు ఏ యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడలేదు. దాంతో ఆక్రమణదారులకు అడ్డే లేకుండాపోయింది. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కంపసాగర్ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 8లోని రెండు ఎకరాల ఐదు గుంటల విస్తీర్ణంలో బండకుంట ఉంది. గ్రామానికి సమీపంలో ఉండటంతో ఒకప్పుడు ఈ కుంట ప్రజల అవసరాల తీర్చేలా ఉండేది. అదేగ్రామానికి చెందిన ఓ కుటుంబానికి చెందిన నలుగురు అన్నదమ్ములు కొన్నేళ్ల కిందట కుంటను చెరపట్టారు. ఉన్న కొద్ది పాటి కుంటను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. వారిస్తున్నా అంగబలంతో ఘర్షణలకు దిగుతున్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా రాజకీయ పలుకుబడితో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు సమాచారం. ఈ మధ్య కాలంలో కుంటను ఇళ్ల ప్లాట్లుగా మార్చి విక్రయాలు చేపడుతున్నారు. ఇద్దరు వ్యక్తులకు సుమారు ఆరు గుంటలను లక్షల రూపాయలకు విక్రయించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. బండకుంట స్థలం విలువ రూ.కోటి వరకు ఉంటుందని అంచనా.. సదరు కుంట స్థలం కొనుగోలు చేసిన వ్యక్తులు ఇళ్లు కట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. కుంటను కబ్జాదారుల చెర నుంచి విడిపించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాలకు ఇదే దుస్థితి

కంపసాగర్ గ్రామం నుంచి పశువులు మేసే ప్రభుత్వ భూమి (ఏనె గుట్ట) సర్వే నెంబర్ 12/5/1లోని 26 ఎకరాల 10 గుంటల్లో సుమారు కిలోమీటరు పరిధిలో విస్తరించింది. భూమికి ఇరువైపులా పట్టా ఉన్న రైతులు ప్రభుత్వ భూమిని ఆక్రమించేశారు. సుమారు 20 ఎకరాల మేర పూర్తిగా కబ్జా చేసి పంటలు పండించుకుంటున్నారు. కేవలం నల్ల రాళ్లు ఉండి చదునుకు పనికి రాని భూమిని మాత్రమే ప్రస్తుతం ఆక్రమణలు పోగా మిగిలి ఉన్నట్లు సమాచారం. ఆ ప్రాంతంలో ఎకరం విలువ సుమారు రూ.30లక్షల వరకు ఉంటుంది. 20 ఎకరాలకు రూ.6 కోట్ల విలువ ఉంటుందని అంచనా. ఇదేపంచాయతీ పరిధిలోని కోమటిగూడెం గ్రామం పక్కన ఉన్న 275 సర్వే నెంబర్‌లోని 18 ఎకరాల 36 గుంటల ప్రభుత్వ భూమిలో సుమారు 10 ఎకరాలను చుట్టు ప్రక్కన ఉన్న రైతులు ఆక్రమించి పొలాలుగా మార్చి పంటలు సాగు చేస్తున్నారు. ఈ భూమి విలువ సుమారు రూ.3కోట్లు వరకు ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. ఇదే సర్వే నెంబరులోని ఎకరం స్థలంలో ఐదు దశాబ్దాలుగా శ్మశానవాటిక ఉండేది. ఐదేళ్ల కిందట కొందరు ఈ శ్మశానాన్ని కబ్జా చేశారు. గత ఏడాది ఒక వ్యక్తి చనిపోగా ఖననం చేయడానికి శ్మశానానికి తీసుకువెళ్లారు. ఆ సమయంలో ఆక్రమణదారులు అడ్డుకున్నారు. గ్రామస్థులకు కబ్జాదారులకు తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. సమస్య పరిష్కారం కాకపోవడంతో పోలీస్‌స్టేషన్ ఎదుట గ్రామస్థులు ధర్నా చేశారు. సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికీ శ్మశానం పూర్తిగా కబ్జాదారుల చేతిలో ఉండింది. గ్రామంలోని బండ కుంటను, కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని కంపసాగర్ గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

మా దృష్టికి రాలేదు..

కంపసాగర్‌లోని బండకుంట, ప్రభుత్వస్థలాల కబ్జా విషయం మా దృష్టికి రాలేదు.

- ప్రమీల, తహసీల్దార్, త్రిపురారం

శ్మశానాన్ని వదలలేదు

కోమటిగూడెంలోని ఎకరం స్థలంలో ఉన్న శ్మశానాన్ని కబ్జాచేశారు. ఎవరైనా చనిపోతే ఎక్కడ ఖననం చేయలో అర్థం కాని దుస్థితి. మండల అధికారులకు, కలెక్టరకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు.కంపసాగర్‌లోని విలువైన ప్రభుత్వ భూములు, గుంటల భూమిని కొందరు కబ్జా చేసి పంటలు సాగు చేస్తున్నారు. ఊరి అవసరాలకు ఉపయోగపడే స్థలా ల ఆక్రమణపై అధికారులు దృష్టి సారించాలి. ప్రభుత్వ భూములను పూర్తిగా సర్వే చేసి హద్దులు ఏర్పాటుచేయాలి.



- బూర మధు, కోమటిగూడెం

గుట్టలో లక్ష్మీసమేతుడికి లక్ష పుష్పార్చన



ప్రధానాలయంలో స్వామివారికి లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జూలై 2 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం ఏకాదశి పూజలు వైభవంగా చేపట్టారు. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొల్పిన పూజారులు గర్భాలయంలో కొలువుదీరిన స్వామిఅమ్మవార్లను మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలు, తులసీ దళాలతో అర్చించారు. స్వామిఅమ్మవార్ల సహస్రనామార్చనలను పఠిస్తూ లక్ష పుష్పార్చన శాస్త్రోక్తంగా చేపట్టారు. స్వామివారి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామిని వేదమంత్రాలతో పంచామృతాభిషేకం జరిపారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవలీ దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభూలను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహహోమం, నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. కొండపైన అనుబంధ శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామికి ముఖమండపంలోని స్ఫటికమూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్రహవనం శైవగామ పద్ధతిలో కొనసాగాయి. అనుబంధ పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేకపూజలు చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 19,21,613 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

ఆలయ ఉత్తర దిశలో షెడ్డు తొలగింపు

గుట్ట ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా కొండపైన ఆలయం, అవసరమైన కార్యాలయాలు మినహా ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. 2022 మార్చి 28న ఉద్ఘాటన నిర్వహించగా అప్పటినుంచి దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఎండా,వానలకు తలదాచుకునేందుకు కొండపైన భక్తులు ఇబ్బందులు పడుతుండటంతో ఈ ఏడాది మార్చి చివరలో ఆలయ ఉత్తర దిశలోని తిరుమాడ వీధిలో దాతల సహకారంతో జర్మన్ టెక్నాలజీ హ్యాంగర్ ఫ్యాబ్రిక్‌తో షెడ్డు అందుబాటులోకి తెచ్చి భక్తులకు నీడ కల్పించారు. దీని కిందనే గడిచిన ఎండాకాలం మొత్తం భక్తులు సేదతీరారు. ప్రస్తుతం షెడ్డు తొలగించడంతో వర్షాకాలం ఎలా అన్న ప్రశ్న తలెత్తుతోంది. కాగా, ఈ షెడ్డు భారీ ఎత్తులో బిగించగా ఆలయ సహజత్వానికి అడ్డుగా మారింది. ఇది బిగించే సమయంలో తూర్పు, పశ్చిమ, దక్షిణ దిశలో కూడా ఏర్పాటు చేయాలని యోచించారు. అయితే షెడ్డు ఏమేరకు ఉపయోగపడుతోంది? ఏ రకమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయో అని కొద్ది రోజులు అధికారులు పరిశీలించారు. ఇదే షెడ్డు కింద ఈ నెల 27 నుంచి 30 వరకు శ్రీ వినాయక నాట్య మండలి(సురభి) నాటక ప్రదర్శనలు ఇచ్చేందుకు ఒక వేదికను ఏర్పాటుచేశారు. ప్రదర్శనలు ముగియడంతో వేదికతో పాటు షెడ్డును కూడా పూర్తిగా తొలగించారు. ఈ షెడ్డు కింద అధికసంఖ్యలో ఎండా, వానలకు భక్తులు సేద తీరారు. ప్రస్తుతం షెడ్డు తొలగించడంతో భక్తులకు రక్షణ కరువైంది.





ఉత్తర దిశలో ఏర్పాటుచేసిన భారీ షెడ్డు (ఫైల్), షెడ్డు తొలగించిన తర్వాత తిరుమాఢ వీధి

ఆలిండియా ర్యాంకర్ ఆర్థికసాయం కోసం ఎదురుచూపు



కుంచం శివ

మిర్యాలగూడటౌన్, జూలై 2 : జాతీయ స్థాయి ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలో ఆలిండియా ర్యాంక్ సాధించిన విద్యార్థి ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా 211వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 24వ ర్యాంకు సాధించిన నల్లగొండ మిర్యాలగూడ పట్టణ విద్యార్థి కుంచం శివ ఆర్థికసాయం కోసం ఎదురుచూస్తున్నాడు. ఉత్తమ ర్యాంకు సాధించిన శివకు ముంబై ఐఐటీ(కంప్యూటర్ సైన్స్)లో ప్రవేశం లభించింది. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన శివను వ్యవసాయ కూలీ అయిన నానమ్మ రాములమ్మ అండగా నిలిచి చదివించింది. కాగా ఆదిత్య పాఠశాల కరస్పాండెంట్ మారుతి అమరేందర్ రెడ్డి పదో తరగతి వరకూ ఉచిత విద్యను అందించగా 10/10 గ్రేడ్ సాధించాడు. నారాయణ జూనియర్ కళాశాల యాజమాన్యం ఉచిత ప్రవేశం కల్పించడంతో పట్టుదలతో చదివి 940 మార్కులు సాధించాడు. అయితే ప్రస్తుతం జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంక్ సాధించి ప్రతిష్టాత్మక ఐఐటీ(ముంబై)లో ప్రవేశం పొందాడు.

ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు

ప్రతిష్టాత్మక ముంబై ఐఐటీలో ప్రవేశంపొందిన శివ ఈ నెల 25న అక్కడ ప్రవేశం పొందాల్సి ఉంది. అయితే కనీస ఖర్చులు కూడా భరించలేని పేదరికంలో ఉన్న శివ ఆర్థికఇబ్బందులతో ముంబైకి కూడా వెళ్లలేని పరిస్థితిలో ఉన్నాడు. తన ఉన్నత చదువుల కోసం ఆర్థికసాయం కావాలని కోరాడు.

దాతలు ఆర్థికసాయం అందించాల్సిన వివరాలు
బ్యాంక్ ఆఫ్ బరోడా, మిర్యాలగూడ శాఖ,
ఖాతా నెంబర్ 49628100018208
ఐఎఫ్‌సీఐ కోడ్ : BARBOMIRYAL
ఫోన్ నెంబరు : 9182871768

లేని తేదీని సృష్టించి పట్టామార్పిడి

- 2018లో ఫిబ్రవరి 29న క్రమబద్ధీకరణ
- లీఫ్ సంవత్సరం కాకపోవడంతో అధికారుల అక్రమాలు వెలుగులోకి
- లేని తేదీతో సాదాబైనామా క్రమబద్ధీకరణ

నల్లగొండ టౌన్, జూలై 2 : ఒకరు భూమిని మరొకరు ఆక్రమించి, తప్పుడు రిజిస్ట్రేషన్ చేస్తుంటారు, కానీ ఏకంగా ఆ సంవత్సరంలో లేని తేదీనే సృష్టించి సాదాబైనా క్రమబద్ధీకరణ పేరుతో పట్టా మార్పిడి చేశారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలో చోటుచేసుకోగా, బాధితుడి ఫిర్యాదుతో కేసులు నమోదు చేసినా అతడి మాత్రం న్యాయం జరుగలేదు. దీంతో ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీలను బాధితుడు ఆశ్రయించాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

మునుగోడు మండలం కల్వకుంట్ల గ్రామానికి చెందిన మేక పురుషోత్తంరెడ్డి గ్రామంలోని ఖాతా నెంబరు 126 ద్వారా టీ28180180085 పాస్‌బుక్ కలిగి ఉన్నాడు. సర్వేనెంబర్ 8, 9, 13, 40లలో 0.30 గుంటల భూమి ఆయనకు ఉంది. ఈ భూమికి సంబంధించిన అన్నిహక్కులను 2020 వరకు కలిగి ఉన్నాడు. అయితే ఈ భూమిపై కన్నేసిక కొందరు రెవెన్యూ అధికారులతో కలిసి 2018లో ఫిబ్రవరి 29న సాదాబైనామా క్రమబద్ధీకరణ పేరిట నకిలీ పత్రాలు 13-బీ సృష్టించి పట్టా మార్పిడిచేశారు. అయితే విషయం తెలుసుకున్న బాధితుడు స్థానిక తహసీల్దార్, ఇతర రెవెన్యూ అధికారులను నిలదీసినా పొంతన లేని సమాధానం వచ్చింది. అదీకాకుండా పట్టా మార్పిడి విషయంలో 2018 ఫిబ్రవరి 13వ తేదీన విచారణకు హాజరు కావాల్సిందిగా పేర్కొంటూ అదే నెల 29న లేఖ ఇచ్చినట్లు అధికారులు సృష్టించారు. ఇదిలా ఉండగా ప్రతీ నాలుగేళ్లకు ఒకసారి వచ్చే లీఫ్ సంవత్సరం 2018లో రాలేదు. ఆ సంవత్సరంలో ఫిబ్రవరి 28వ తేదీతోనే ముగిసింది. అయితే దీనిని పట్టించుకోని అధికారులు తమకు తోచిన తేదీలు వేసి పట్టా మార్పిడి చేశారు. అదేవిధంగా 2016లో ప్రభుత్వం జారీ చేసిన జీవో 153 ప్రకారం ఐదు ఎకరాలు, ఆపైన భూమి ఉన్న వారికి సాదాబైనామా కింద ఆర్‌వోఆర్ పట్టా ఇవ్వకూడదు. అలాంటి వారు సాదాబైనా క్రమబద్ధీకరణ కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. కానీ, నిబంధనలకు విరుద్ధంగా మాన్యువల్ పద్ధతిలో దరఖాస్తు రెవెన్యూ అధికారులు స్వీకరించారు. ఏడు ఎకరాలకు పైగా ఉన్న వ్యక్తికి భూమిని బదలాయించారు. దీంతో 2021లో సదరు వ్యక్తులకు పట్టా పాస్‌పుస్తకం వచ్చింది. దీంతో బాధితుడికి విషయం తెలిసింది. సదరు బాధితుడు తనకు జరిగిన అన్యాయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ పేరిట కాలయాపన చేశారు.

అంతేతప్ప ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. దీంతో విసిగివేసారిన బాధితుడు చివరకు నల్లగొండ జిల్లా కలెక్టర్ సీ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌లను ఆశ్రయించాడు. అక్రమాలకు పాల్పడిన వ్యక్తులు, అధికారులు, పోలీసుపై చర్యలు తీసుకోవాలని కోరాడు.



డిండిలో మంత్రి సీతక్కకు సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు

మంత్రి సీతక్కకు స్వాగతం

డిండి, జూలై 2: మంత్రి సీతక్కకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నల్లగొండ జిల్లా డిండి మండలకేంద్రంలో మంగళవారం ఘనస్వాగతం పలికారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌కు వెళ్తున్న సీతక్క డిండి మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. జీవో 51ని రద్దు చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేసి వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాదమోని శ్రీనివాస్‌గౌడ్, పున్న దినేష్, వెంకటేష్, మూడావత్ భీముడు, కయూం, ఈశ్వర్, మల్లేష్, సురేష్, వేణు, అబ్దుల్ ఖాదర్ తదితరులు ఉన్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం

- దెబ్బతిన్న కల్వర్టులు, ప్రయాణానికి ఇబ్బందులు





దూదివెంకటపూర్- సోమారం గ్రామాల కొట్టుకుపోయిన కల్వర్టు, వాగుపై ధ్వసంమైన కాజ్‌వే

రాజాపేట, జూలై 2 : గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని రోడ్లు, కల్వర్టులు, కాజ్‌వేలు దెబ్బతిన్నాయి. బేగంపేట, దూదివెంకటపూర్, కాల్వపల్లి, పారుపల్లి వాగులపై ఉన్న కాజ్‌వేలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కుర్రారం- దూదివెంటపూర్ గ్రామాల్లోని వాగులపై నిర్మించిన కల్వర్టుల కింద మట్టి కొట్టుకుపోవడంతో ప్రమాదకరంగా మారాయి. పారుపల్లి వాగుపై కాజ్‌వే తాత్కాలికంగా కల్వర్టు నిర్మించగా ఎప్పుడు కొట్టుకుపోతుందని తెలియని పరిస్థితి నెలకొంది. కాల్వపల్లి వాగుపై రోడ్డు బ్రిడ్జిని నిర్మాణానికి రూ.400 కోట్లు, బేగంపేట వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.9.50 కోట్లు, పారుపల్లి వాగు రోడ్డు బ్రిడ్జి నిర్మాణానికి రూ.12.6 కోట్లు నిధుల మంజూరు కాగా గత ఏడాది అప్పటి ఎమ్మెల్యే సునీతామహేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కాగా బేగంపేట బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతుండగా పారుపల్లి -కాల్వపల్లి వాగులపై నిర్మాణ పనులు ఇప్పటికీ నోచుకోలేదు. వర్షాకాలం ప్రారంభమైన పనులు మొదలు కాకపోవడం, దెబ్బతిన్న కల్వర్టు మరమ్మతులు చేపట్టకపోవడం ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పనులు వేగంగా చేపట్టాలి



రాజాపేట-బొందుగుల గ్రామాల మధ్య పారుపల్లి వాగుపై ఉన్న కాజ్‌వే కొట్టుపోవడంతో ఇబ్బందిగా మారింది. నిధులు మంజూరై శంకుస్థాపన చేసి ఏడాది గడుస్తున్నా పనులు ప్రారంభించలేదు. దెబ్బతిన్న కల్వర్టులు, కాజ్‌వేలతో ప్రయాణం అంటే ప్రమాదంగా మారింది. ఈ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి.

- పుట్ట వీరయ్య, గ్రామస్థుడు, బొందుగుల



నందాపురం- అనతంతారం గ్రామాల మధ్య అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణం

అసంపూర్తి వంతెనతో ఇబ్బందులు

తిరుమలగిరి, జూలై 2 : సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం అనంతారం-నందాపురం గ్రామాల మధ్య వాగుపై అసంపూర్తి బ్రిడ్జితో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక వాగుపై కొన్నాళ్ల కిందట బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించారు. వానాకాలం వచ్చినా నిర్మాణం పూర్తికాకపోవడంతో రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విత్తనాలు, నాట్ల సీజన్ కావడం వల్ల రెండు గ్రామాల రైతులు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై విత్తనాలు, ఎరువులు, తీసుకెళ్లడానికి తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.బ్రిడ్జి పక్కనే తాత్కాలికంగా ఏర్పాటుచేసిన బాటలో వర్షపు నీరు నిలవడంతో వాహనాలు గుంతల్లో వాహనాలు దిగబడుతున్నాయని వాపోతున్నారు. బ్రిడ్జి స్లాబ్‌భాగం పూర్తయ్యిందని రెండు వైపులా(రెయిలింగ్) గోడ నిర్మించి, మట్టిని పోసి చదును చేస్తే నిర్మాణం పూర్తి అవుతుందంటున్నారు. వానాకాలం నేపథ్యంలో త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



బాధితుడికి ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, జూలై 2: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, గ్రామీణ పేదలకు మెరుగైన వైద్య సదుపాయం అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎల్‌వోసీ చెక్కులు అందజేస్తున్నట్లు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని శివారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బొక్క అద్వత్‌రెడ్డికి వైద్య ఖర్చుల కోసం రూ. 2.50లక్షల ఎల్‌వోసీ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. రైతులకు ఏక కాలంలో రూ. 2లక్షల రుణం మాఫీ చేసే ప్రక్రియ ఈగస్టు 15 నుంచి ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నిరవేరుస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకులు ఉప్పునూతల వెంకటేష్‌యాదవ్, మండల నాయకులు సంతోష్‌యాదవ్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'పాత ఇనుప సామగ్రి దుకాణాన్ని తొలగించాలి'

మోత్కూరు, జూలై 2: మోత్కూరు మునిసిపాలిటీలోని పోతాయగడ్డలో అతిథి బార్ వెనుక కాలనీలో ఇళ్ల మధ్య ఉన్న పాత ఇనుపసామగ్రి దుకాణాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని మంగళవారం కాలనీ వాసులు యశ్వంత్, మహేష్, చంద్రశేఖర్, మధు, హరిబాబు, లోకేష్, కిరణ్మయి, అరుణ, సురేష్ కోరారు. ఈ మేరకు ఆ కాలనీకి చెందిన మహేష్, నరేందర్ మంగళవారం మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. పాత ఇనుప సామగ్రి కొట్టులో ప్లాస్టిక్ డబ్బాలు, కవర్లు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోందని, దోమలు పెరిగి ప్రజలు రోగాలబారిన పడుతున్నారని పేర్కొన్నారు. పాత సామాన్లలో ఎలుకలు, పందికొక్కులు, విషపురుగులు స్థావరాలు ఏర్పర్చుకుని ఇళ్లలోకి వస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి ఆ కొట్టు ఊరి బయటకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరుపేద చేనేత కార్మికులకు ఆర్థిక సాయం



త్రిఫ్టు పథకం పొదుపు డబ్బులు పంపిణీ చేస్తున్న టీఆర్ యువసేన నాయకులు

భూదాన్‌పోచంపల్లి, జూలై 2 : ది పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్, పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు తడక రమేష్ పుట్టిన రోజును పురస్కరించుకుని మంగళవారం ఐదుగురు నిరుపేద చేనేత కార్మికులకు త్రిఫ్టు స్కీంకు పొదుపు డబ్బులను అందజేసి వారి ఖాతాలో జమచేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈమేరకు పట్టణంలోని పోచంపల్లి చేనేత టైఅండ్‌డై సిల్కు చీరల ఉత్పత్తి దారుల వేదిక వద్ద జరిగిన కార్యక్రమంలో టీఆర్ యువసేన నాయకులు, చేనేత నాయకులు చింతకింది రమేష్, పాలాది యాదగిరి, ముస్కూరి నర్సింహ, మంగళపల్లి రాజారమేష్, సీత పాండు, కర్నాటి పురుషోత్తం ఉన్నారు.

సంక్షిప్తంగా..

ఆత్మకూరు(ఎం) : డీఎస్సీ నియామకాలు జరిగే వరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టుల్లో తాత్కాలిక విద్యావలంటీర్లను నియమించి , బదిలీ అయినసెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని యూటీఎఫ్ జిల్లా సాంస్కృతిక కమిటీ కన్వీనర్ కట్లా రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.

బీబీనగర్: బీబీనగర్ పెద్ద చెరువు అలుగు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని బీజేపీ రాష్ట్ర నాయకులు పిట్టల అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా పరిపాలన అధికారి జగన్‌ను కలిసి వినతి పత్రం అందచేశారు. పరాంకుశం, అశోక్‌చారి ఉన్నారు.

చౌటుప్పల్ టౌన్ : హిందూ సమాజాన్ని కించపరిచే విధంగా పార్లమెంట్‌లో ప్రసంగించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బేషరతుగా క్షమాపన చెప్పాలని బీజేపీ మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని జాతీయ రహదారిపై రాహుల్‌గాంధీ దిష్టి బొమ్మను బీజేపీ కార్యకర్తలు దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, మునిసిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ పి. శ్రీధర్ బాబు, జిల్లా కార్యదర్శి ఆలె చిరంజీవి పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: ఫౌండేషన్ల పేరుతో అధిక ఫీజులను వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినియోగదారుల ప్రొటెక్షన్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి పులిపలుకుల మహేష్ అన్నారు. మంగళవారం ఎంఈవో కార్యాలయ సిబ్బందికి ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు అశోక్, మొరిగాడి సిద్దులు, ఉపేందర్ ఉన్నారు.

ఆలేరు రూరల్: విద్యార్థుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడి అమరుడైన కోలా శంకర్ నేటి విద్యార్థులకు ఆదర్శనీయుడని పీడీఎస్‌యూ జిల్లా నాయకులు గడ్డం నాగరాజు, బేజాడి కుమార్, పంగ రవిలు అన్నారు. మంగళవారం ఆలేరు కొలనుపాకలో కోలా శంకర్ 34వ వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మామిడాల భిక్షపతి, అడవయ్య, సోమయ్య, రాందాసు, ప్రవీణ్, మహేష్ ఉన్నారు.

మోత్కూరు : తెలంగాణ గ్రంథాలయ వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ముదుగంటి సుధాకర్‌రెడ్డి తనను తెలంగాణ గ్రంథాలయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారని మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రానికి చెందిన కోమటి మత్స్యగిరి మంగళవారం విలేకరులకు తెలిపారు.

అడ్డగూడూరు: మండల కేంద్రానికి చెందిన పరిగల మధు కూమారుడు యశ్వంత్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, ఈ విషయాన్ని యూత్ కాంగ్రెస్ నాయకుడు బైరెడ్డి సందీప్ రెడ్డి తెలుపగా మంగళవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో మంత్రి వెంకటరెడ్డి ఆ నిరుపేద కుటుంబానికి రూ, 50వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాలుడి తల్లిదండ్రులకు మనోధైర్యాన్ని నింపి, కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

వలిగొండ: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్‌ను వెంటనే మంజూరు చేయాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్‌పీఆర్‌డీ సమావేశం జరిగింది. రేణుక, కృష్ణమూర్తి, సత్తయ్య, కొమురయ్య, రవి, పద్మ పాల్గొన్నారు.

రాజాపేట: మండలం కాల్వపల్లి నదీతీర ఆశ్రమంలో పరమహంస పరివాచకచార్య చిన్మయియానంద యోగిశ్వర్ల 20 వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఆశ్రమంలో భగవద్గీత, యజ్ఞంలో ప్రవచనాలు, అఖండభజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రొఫెసర్ చిన్నప్ప, స్వదనందగిరి స్వామి, నిత్యానందాస్వామి, మెరుగు వెంకటదాసు, సకినాల కృష్ణమూర్తి, తుఖారం మల్లేశం పాల్గొన్నారు.

ఏక కాలంలోనే రైతులకు రుణమాఫీ

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

తుర్కపల్లి/ బొమ్మలరామారం, జూలై 2: ఏక కాలంలోనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తగు చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలు, సూచనలు సేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం చేసే రైతుకు పెద్దపీట వేస్తూ వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. పెట్టుబడి సాయంగా ఇచ్చే రైతు భరోసాను దుబారా లేకుండా ఇచ్చేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపడుతుందన్నారు. వెంచర్లు, కొండలు, గుట్టలు, సేద్యంకాని భూములకు ఇవ్వడం వల్ల నిజమైన రైతుకు నష్టం జరుగుతుందన్నారు. రైతు భరోసా ఎవరికిస్తే బాగుంటుంది అనే దానిపై సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి దిశానిర్దేశం చేస్తుందన్నారు. రైతులు రసాయన ఎరువులతో కాకుండా సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో పంటలు పండించాలని కోరారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి పీఏసీఎస్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో 10 ఎకరాల వరకు ఎకరాకు 10వేల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని మెజార్టీ రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అదే విధంగా క్వింటాకు రూ. 500లు బోనస్, సన్నరకం వడ్లకే కాకుండా దొడ్డు రకం వరి ధాన్యానికీ ఈ బోనస్ ఇవ్వాలని మెజార్టీ రైతులు తమ అభిప్రాయాన్ని తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ సింగి రెడ్డి నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ భూక్య సుశీలరవీందర్ నాయక్, ఆలేరు ఏడీఏ పద్మావతి, భువనగిరి సీసీ బ్యాంక్ మేనేజరు శిరీష, తహసీల్దార్ దేశ్యానాయక్, ఎంపీటీసీ బోరెడ్డి వనజహన్మంతరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కొండ్ర ముత్యాలు, ఏవో దుర్గేశ్వరీ, మాజీ డీసీసీబీ డైరక్టరు పిన్నెపురెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బోరెడ్డి రాంరెడ్డి, సెక్రెటరీ రమేష్, జనార్ధన్‌రెడ్డి కార్యవర్గ సభ్యులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని వేలుపల్లి, తుర్కపల్లి, వాసాలమర్రి, గందమల్ల ఇందిరానగర్, బీల్యానాయక్‌తండా పంచాయతీ పరిధిలోని జగ్గుతండా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అయిలయ్య శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్య సుశీలరవీందర్‌నాయక్, తహసీల్దార్ దేశ్యానాయక్, పీహెచ్‌సీ డాక్టర్ సుదీర్‌రెడ్డి, ఎంపీటీసీలు గిద్దె కరుణాకర్, పలుగుల నవీన్‌కుమార్, ధనావతు మోహన్‌బాబు, ఆలేరు మాజీ మార్కెట్ చైర్మన్ దానావతు శంకర్‌నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ముత్యాలు పాల్గొన్నారు. బొమ్మలరామారం మండలంలోని రాంలింగంపల్లి గ్రామంలో పల్లె దవాఖాన భవనాన్ని ప్రారంభించారు.



తుర్కపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

రైతుల సంక్షేమమే ధ్యేయం: శ్రీనివాస్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్ : వ్యవసాయ రంగం అభివృద్ధి-రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని డీసీసీబీ నూతన చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ నుంచి హైదరాబాద్ వెళుతున్న చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి చౌటుప్పల్ పట్టణంలో కొద్ది సేపు ఆగి రోడ్డు పక్కన టీ తాగారు. చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని స్థానిక కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను రూపొందించిందని, రూ.2లక్షల రుణమాఫీ తో రైతులకు ఎంతో మేలు జరగనుందని ఆయన అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధిని సాధించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు సుర్వి నర్సింహ్మ గౌడ్, బోయ దేవేందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడగు శ్రీనివాస్ గౌడ్, ఎన్‌ఎస్‌యూఐ మునుగోడు అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, కౌన్సిలర్లు ఎండి. బాబాషరీఫ్, బొడిగే బాలకృష్ణ, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.శేఖర్ గౌడ్, ఎస్సీ సెల్ బ్లాక్ అధ్యక్షుడు ఊదరి నర్సింహ, నాయకులు కుక్కల నర్సింహ, పస్తం గంగరాములు, దోనకొండ కృష్ణ, అజయ్, వి.యాదయ్య, వి.నర్సింహ్మ, నాగేష్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గుండాల: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పీఏసీఎస్ లింగాల బిక్షం అన్నారు. గుండాల మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ సందర్భంగా రైతు భరోసాపై రైతుల అభిప్రాయాలను, సూచనలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ యాదలక్ష్మీ, డైరెక్టర్లు శ్రీనివాస్, ఎల్లయ్య, సీఈవో నాగయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఎం 'పోరుబాట'

భువనగిరి టౌన్/ భువనగిరి రూరల్, జూలై 2: ప్రజా సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన పోరుబాట కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. జాతీయ రహదారిని నిర్మించి సర్వీస్ రోడ్డును విస్మరించడంతో భువనగిరి బైపాస్ రోడ్డుపై ట్రాఫిక్ సమస్య పెరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ అన్నారు. సర్వీస్ రోడ్డుకు ప్రతిపాదించిన అలైన్‌మెంటును పోరుబాటలో భాగంగా సీపీఎం బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీసు రోడ్డును నిర్మించక పోవడంతోనే స్వర్ణగిరి, రేణుక ఎల్లమ్మ దేవాలయాలకు వస్తున్న భక్తులు ట్రాఫిక్ ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. పలు చోట్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. సమస్యల పరిష్కారానికి రెండు ఆలయాల వద్ద రోడ్డు దాటేందుకు బ్రిడ్జి నిర్మించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అనురాధ, కృష్ణ, వనం రాజు, ఎల్లయ్య, అంజయ్య పాల్గొన్నారు.

● భువనగిరి శివారులోని ప్రభుత్వ ఐటీఐ సమీపంలో జాతీయ రహదారి మధ్య అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భువనగిరి పట్టణం నుంచి రామకృష్ణాపురం, పెంచికల్ పహాడ్ గ్రామాలతో పాటు మూడు మండలాలకు సంబంధించి 24గ్రామాలకు వెళ్లే రహదారిపై అండర్ పాస్ నిర్మాణం చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. నాయకులు దయ్యాల నర్సింహ, ఎల్లయ్య, వెంకటేష్ ఉన్నారు.

గుండాల: మండలంలోని నూనేగూడెం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గతంలో ఈ గ్రామానికి బస్సుసౌకర్యం ఉండేదని ఏడాదిగా బస్సు సౌకర్యాన్ని నిలిపివేశారని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో సైదులు, నర్సయ్య, అనసూర్య, రమేశ్, అండెం యాదిరెడ్డి పాల్గొన్నారు.



భువనగిరిలో సర్వీసు రోడ్డు స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు



భువనగిరిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మోత్కూరు : మోత్కూరు తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈమేరకు తహసీల్దార్ డి.రాంప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు బొల్లు యాదగిరి, పైళ్ల యాదిరెడ్డి, గుండు వెంకటనర్సు, కుర్మేటి యాదయ్య, కందుకూరి నర్సింహ, మాండ్ర చంద్రయ్య, గంగయ్య పాల్గొన్నారు.

రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించేలా చట్టం చేయాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు పాటి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకుడు పైళ్ల యాదిరెడ్డి, పైళ్ల రాంరెడ్డి, చంద్రారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్, జూలై 2: తంగడపల్లిలో మురుగు నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి బండారు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యుడు ఎండి. పాషా అన్నారు. చౌటుప్పల్ మునిసిపాలిటీలోని తంగడపల్లి (15వ వార్డు)లోని పలు ప్రాంతాల్లో మంగళవారం సీపీఎం పోరుబాట సందర్భ గా ప్రజా సమస్యలను నాయకులు పరిశీలించారు. సీపీఎం నాయకులు బత్తుల దాసు, చీకూరి ఈదయ్య, రాములు, కనకయ్య, శివప్రకాష్, బడేటి చంద్రయ్య, స్వామి, ఇమామ్, బక్కయ్య, వసంత, లింగమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



చౌటుప్పల్ సీహెచ్‌సీని పరిశీలిస్తున్న ఐద్వా బృందం

చౌటుప్పల్ టౌన్, జూలై 2: ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వరి డిమాండ్ చేశారు. చౌటుప్పల్ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహిస్తున్న వైద్య సేవలను మంగళవారం ఐద్వా బృందం పరిశీలించింది. రోగులకు వైద్యులు, నర్సులు అందిస్తున్న వైద్య సేవలను ఆరా తీశారు. టాయిలెట్స్, ల్యాబ్, ఫార్మసీ, ఓపీ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా రామేశ్వరి మాట్లాడుతూ, వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారని ఆమె అన్నారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించి సీజనల్ వ్యాధులు సోకకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని ప్రజలను ఆమె కోరారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని ఆమె అన్నారు. పరిశీలన బృందంలో ఐద్వా ప్రతినిధులు బత్తుల జయమ్మ, చింతకింది శారద, దొడ్డి అండాలు, హర్షా బేగం ఉన్నారు.

'కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగడతాం'

ఆత్మకూరు(ఎం), జూలై 2: ఎస్సీ వర్గీకరణలో జాప్యంపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మొండిని ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని ఎమ్మెస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకటేష్ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకు, పిలుపునిచ్చారు. ఈనెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ హైద్రాబాద్‌లో ఇందిరాపార్కు వద్ద చేపడుతున్న దీక్ష కరపత్రాలను మంగళవారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకణ విషయం గత 30 ఏళ్లుగా రాచపుండుగా రగులుతోంది తప్ప పరిష్కారం కావడంలేదని, రాజకీయ నాయకుల మాయమాటలు, మోసపూరిత వాగ్దానాలు నమ్మి మాదిగ సమాజం మోసపోతోందన్నారు. మాదిగ సమాజాన్ని మోసం, దగా చేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరిపై చేపట్టిన దీక్ష కు జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మందుల పరుషరాములు ఎన్.మహేష్, సాయిబాబు, ఆదినారాయణ, స్వామి, లక్ష్మణ్, వినోద్. నాగరాజు పాల్గొన్నారు.

ర్యాకల శ్రీనుకు డాక్టరేట్



భువనగిరి రూరల్, జూలై 2: భువనగిరి మండలం తాజ్‌పూర్‌కు చెందిన ర్యాకల శ్రీనివాస్ పలు సామాజిక, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టడంతో ఆయనకు ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. మంగళవారం స్థానిక బీఆర్‌ఎస్ ప్రతినిధులు, నేతలు శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. జడ్పీటీసీ సుబ్బురు బీరుమల్లయ్య, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు జనగాం పాండు, ఏవీ కిరణ్, మునిసిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్లు ఎనబోయిన ఆంజనేయులు, చింతల కిష్టయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డిలు మాట్లాడుతూ డాక్టరేట్ అవార్డు పొందిన శ్రీనివాస్ స్ఫూర్తితో ప్రతీ ఒక్కరు సమాజ శ్రేయస్సుకు తోడ్పాటునందించి, ప్రజల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు.

విద్యా సంస్థల బంద్ రేపు: ఎస్‌ఎఫ్‌ఐ

రామన్నపేట, జూలై 2: విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ జూలై 4వ తేదీన జరిగే విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి డాక్టర్లను అందించే నీట్ పరీక్షపత్రాన్ని లీక్‌చేయడంతో 20లక్షల మంది విద్యార్థుల జీవితం అగమ్యగోచరంగా మారిందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే విద్యా సంస్థల బంద్ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, యాజమాన్యాలు సహకరించాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బుంగమట్ల శివ, పిల్లి కార్తీక్, దాసరి కార్తీక్, ముఖేష్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు శిక్షణ తరగతులు, వైద్యశిబిరం

భువనగిరి టౌన్, జూలై 2: జర్నలిస్టుల వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు ప్రెస్ అకాడమీ సహకారంతో త్వరలో జిల్లా స్థాయి రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు టీయూడబ్ల్యూజె(ఐజేయూ)జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యంబ నర్సింహులు, పోతంశెట్టి కరుణాకర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు భువనగిరి మల్లేశం తెలిపారు. మంగళవారం భువనగిరిలో జరిగిన యూనియన్ భువనగిరి కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. నిరంతర పని ఒత్తిడికి గురవుతున్న జర్నలిస్టులు, వారి కుటుంబాల ఆరోగ్యమే లక్ష్యంగా జిల్లా స్థాయి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. అలాగే జర్నలిస్టుల హెల్త్ కార్డులపై అన్ని ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ప్రెస్ అకాడమి చైర్మెన్, ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ రెడ్డి, టీయూడబ్ల్యూజె (ఐజెయు)రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె.విరహత్ అలీ, కె.రాంనారాయణను కోరుతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ భువనగిరి ప్రింట్ మీడియా కమిటీ అధ్యక్షడిగా మడికొండ మల్లేశ్, ఉపాధ్యక్షుడిగా కందుల శ్రీనివాస్, అజీజ్‌హుసేన్, ప్రధాన కార్యదర్శిగా ఎండి జమాల్, కోశాధికారిగా జి.శ్రీధర్, సహాయ కార్యదర్శులుగా గుర్రాల శివనాగేందర్, చింతపండు రాజు, ఎండి.సుజాయిత్ ఎన్నికయ్యారు. ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ అధ్యక్షుడిగా పాశం నవీన్, ఉపాధ్యక్షుడిగా మెరుగు అనీల్, ప్రధాన కార్యదర్శిగా పి.లక్ష్మీనారాయణ, కోశాధికారిగా జి.హరిబాబు, సహాయ కార్యదర్శులుగా వీరవెల్లి రమేష్, నిమ్మల సురేష్‌గౌడ్ ఎన్నికయ్యారు.



సమావేశంలో సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలి: బీజేవైఎం



చౌటుప్పల్ తహసీల్దార్ కార్యాలయంలో బైఠాయించిన బీజేవైఎం కార్యకర్తలు

చౌటుప్పల్ టౌన్, జూలై 2: నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి తరుణ్‌రెడ్డి డిమాండ్ చేశారు. నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చౌటుప్పల్ తహసీల్దార్ కార్యాలయంలో బైఠాయించారు. ప్ల కార్డులు పట్టుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తరుణ్ రెడ్డి మాట్లాడుతూ, నిరుద్యోగ భృతిని అందించాలని, జాబ్ కాలెండర్‌ను విడుదల చేయాలని ఆయన అన్నారు. అనంతరం తహసీల్దార్ హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు దిండు భాస్కర్, ఆలె చిరంజీవి, చినుకని మల్లేశం, కిషోర్, నరేష్, శరత్, వెంకటేష్, శివమల్లారెడ్డి, వినయ్‌రెడ్డి, శరత్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, గౌతమ్, శివసాయి, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

మోటకొండూర్ : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల ఉద్యోగాలకు సంబంధించి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని బీఆర్‌ఎస్ యువజన విభాగం ఆలేరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జీవిలికపల్లి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిరుద్యోగులను మోసం చేస్తుందని అన్నారు. 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలన్నారు. సమావేశంలో యువజనవిభాగం పట్టణ అధ్యక్షుడు బొట్ల మహేష్, కొంపల్లి నర్సింహ, నరేష్ పాల్గొన్నారు.

తుర్కపల్లి : నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు కానుగంటి బాస్కర్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఆర్‌ఐ జహంగీర్‌కు వినతి పత్రం అందజేసారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు మేకల శ్రీనివాస్, మేకల పాండు యాదవ్, బీజేవైఎం ఆలేరు అసెంబ్లీ కన్వీనర్ పాముల ప్రవీన్, మండల ప్రధాన కార్యదర్శులు జక్కుల వెంకటేష్, అంజనేయులు, నాయకులు శ్రీను, కనకరాజు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు ఉప్పాగుల గిరిగౌడ్, నాయకులు వెలిజల శ్రీను, కాట్కూరి శ్రీకాంత్, గూడూరి మంజునాథ్‌రెడ్డి, చిలివేరు రాజు, కొగురి శ్రవణ్,రాపర్తి నవనీత్,మారసానీ సాయి, కొగూరి గురునాథ్, గొల్లూరి యశ్వంత్ పాల్గొన్నారు.

వలిగొండ: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను ఆదుకోవాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు మందడి రంజిత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ రాచకొండ కృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు బోళ్ల సుదర్శన్, నాయకులు శ్రీనివాస్, మహేష్, హరీష్, రామకృష్ణ, మత్స్యగిరి, మల్లేశం, వెంకటేశం, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండాల: బీజేవైఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ జలకుమారికి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో నాయకులు సోమరాజు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : నిరుద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. తహసీల్దారు శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్ తోపాటు గొలనుకొండ ప్రభాకర్, గంగపురం శ్రవణ్‌కుమార్, వంగూరి సిద్దు, ఇటమోని బాలు, చిలువేరు నరేందర్, గడ్డం మహేష్, సాయికిరణ్ పాల్గొన్నారు.

రాజాపేట: మండల కేంద్రంలో తహసీల్దార్ దామోదర్‌కు బీజేవైఎం, బీజేపీ నాయకలు వినతిపత్రం అందజేశారు. నాయకులు శేఖర్‌రెడ్డి, శ్రీధర్, శ్రీను, వేణు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం: కాంగ్రెస్

భువనగిరి టౌన్: సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ఎన్నికల్లో గెలిచి హామీని విస్మరిస్తూ బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసగిస్తున్నదని మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్ అన్నారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం భువనగిరిలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగాల కల్పన కోసం బీజేపీ మంత్రులను ఘెరావ్ చేయడాన్ని మరచి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను అడ్డుకునేందుకు బీజేపీ కార్యకర్తలు ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటు అన్నారు. 6 గ్యారెంటీల అమలుతో పాటు ఉద్యోగ నియామకాలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీచైర్మన్ బర్రె జహంగీర్, కాంగ్రెస్ నాయకులు అవేజ్‌చిస్తీ, నరేష్ పాల్గొన్నారు.



ప్రధాని నరేంద్రమోదీ ఫ్లెక్సీని దహనంచేస్తున్న కాంగ్రెస్ నాయకులు